క్లుప్తంగా

చిలుకూరు పీఏసీఎస్ ఇన్‌చార్జ్ చైర్మన్‌గా పద్మావతి



గన్నా పద్మావతిని సన్మానిస్తున్న డైరెక్టర్లు

చిలుకూరు: చిలుకూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం వైస్ చైర్మన్ గన్నా పద్మావతి ఇన్‌చార్జ్ చైర్మన్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సంఘం చైర్మన్ అలసకాని జనార్దన్ వ్యక్తిగత పనుల నిమిత్తం రెండు నెలలు అమెరికా పర్యటనకు వెళ్లాల్సి ఉండడంతో వైస్ చైర్మన్ పద్మావతికి ఇన్‌చార్జ్ చైర్మన్ బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ చిలువేరు లక్ష్మీనారాయణ, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లి ఆలయానికి కల్యాణ రాజసింహాసనం బహూకరణ



ధర్మకర్తలకు కల్యాణ రాజసింహాసనం అందజేస్తున్న దాతలు

మఠంపల్లి : మట్టపల్లిలోని శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీప్రహ్లాదయోగానంద శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి మిర్యాలగూడకు చెందిన ప్రవీణ్‌కుమార్ –మేఘన దంపతులు, రత్నాచారి –పుష్పాంజలి దంపతులు రూ.1.50 లక్షల విలువ గల ఇత్తడి తొడుగు కల్యాణ రాజసింహాసనాన్ని శుక్రవారం ఆలయ అనువంశిక ధర్మకర్తలు, ఈఓకు బహూకరించారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రాజసింహాసనంపై శ్రీస్వామి అమ్మవార్లను ప్రతిష్ఠింపజేశారు. తదనంతరం దాతలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, ఈఓ సిరికొండ నవీన్ కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, వంశీకృష్ణమాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా నిత్య కల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం, మాంగల్యధారణ నిర్వహించి కల్యాణతంతును పూర్తిగావించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.


మృతుని కుటుంబానికి అంబేద్కర్ కమిటీ చేయూత



ఆర్థికసాయం, బియ్యం అందజేస్తున్న అంబేద్కర్ కమిటీ సభ్యులు

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడులో గల గ్రంథాలయం ఇన్‌చార్జ్ నందిపాటి వెంకటేశ్వర్లు అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం అంబేద్కర్ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేలు, 50 కేజీల బియ్యం అందజేశారు. అంబేద్కర్ కమిటీ అధ్యక్షుడు నరేష్, ఉపాధ్యక్షుడు చిటికెల కిరణ్, లంకపల్లి రమేష్, ఒగ్గు మహేష్, మధు, మహేష్, అనిల్, ముత్తయ్య, మట్టయ్య, రాజేష్, రాజయ్య, వినోద్, సందీప్, పద్మ, శోభ, కలమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరలు పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న నాగుల్‌మీరా

మఠంపల్లి : గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని చౌటపల్లిలో యూత్ కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నాగుల్‌మీరా శుక్రవారం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక వసతులు కల్పించాలి

నడిగూడెం : ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక వసతులు కల్పించాలని బీఆర్‌ఎస్ మండల సమన్వయ కమిటీ కన్వీనర్ అనంతుల అంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల నడిగూడెంలోని ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించి, సమస్యలపై సంబంధిత అధికారులకు వినతిపత్రాలు పంపినట్లు తెలిపారు. దీంతో జిల్లా వైద్య విధాన పరిషత్ అధికారి వెంకటేశ్వర్లు స్పందించి వైద్యుల కొరతను పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు.

చలాన్లతో పరేషాన్

- కోదాడలో ట్రాఫిక్ పోలీసుల తనిఖీలతో ప్రజల బెంబేలు
- వరదలొచ్చినా, పండుగలున్నా చలాన్లే టార్గెట్‌గా ఖాకీల విధులు
- ట్రాఫిక్ క్రమబద్ధీకరించడంలో మాత్రం నిర్లక్ష్యమని విమర్శలు



రంగా థియేటర్ సెంటర్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు వేసే చలాన్లతో పేద ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వాహనాల తనిఖీల్లో నంబర్ ప్లేట్లు లేవని, డ్రంక్ అండ్ డ్రైవ్ అని, లైసెన్స్ లేదని ఇలా ఏదో ఒక రకంగా చలాన్లు విధిస్తున్నారు. నేరాలు, ప్రమాదాల నియంత్రణకు వాహనాల తనిఖీ తప్పనిసరినే. కానీ కోదాడలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఫైన్లు విధించడమే తమ డ్యూటీ అన్నట్లు ట్రాఫిక్ పోలీసులు వ్యవహరిస్తున్నారని పలువురు వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఏ పట్టణంలో లేని విధంగా ఇక్కడ నిత్యం వాహనాలకు చలాన్లు వేస్తున్నారని చెబుతున్నారు. అయితే పలుకుబడి ఉన్న వాహనాలకు నంబర్ ప్లేట్లు లేకపోయినా మద్యం తాగి పట్టుబడినా నాయకులు ఫోన్లు చేస్తే వదిలేస్తున్నారని, వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే గ్రామీణ ప్రాంత పేదలే చలాన్లు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని పలువురు వాహనదారులు విమర్శిస్తున్నారు.

వరదలొచ్చినా పట్టనట్లు..

పండుగల రోజుల్లో కూడా వాహనదారులకు వదలడం లేదు కోదాడ ట్రాఫిక్ పోలీసులు. ఇక ఈ నెల 1వ తేదీన కోదాడలో భారీ వర్షం వచ్చి వరదలకు కొట్టుకపోయి ఇద్దరు మృతి చెంది పట్టణం అతలాకుతలమైంది. ప్రజల ఇళ్లు మునిగి, సామాగ్రి తడిసి, విద్యుత్ సౌకర్యం, తాగు నీరు లేక పట్టణ ప్రజలు అటూఇటూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆ రోజు కూడా ట్రాఫిక్ పోలీసులు తమకేమీ పట్టనట్లు వాహనదారులు తనిఖీలు చేశారు. దీంతో పలువురు వరద బాధితులు ఇబ్బందులు పడ్డట్లు తెలిసింది.

ఆస్పత్రికెళ్తున్నా కనికరించకుండా..

కోదాడ మండలంలోని ఓ గ్రామానికి చెందిన భార్యభర్తలు తమ కుమారుడికి జ్వరం రావడంతో 15 రోజుల క్రితం ఖమ్మంలోని ఆస్పత్రిలో చేర్పించారు. తమ కుమారుడి వద్ద బంధువులను ఉంచి ఇంటికి వచ్చిన వారు ఉదయం 9 గంటలకు డబ్బులు, భోజనం తీసుకొని ఖమ్మం బయలుదేరారు. వారు పట్టణంలోకి పెట్రోల్ కోసం బస్టాండ్ వైపు రాగానే వారి ద్విచక్రవాహనానికి నంబర్ ప్లేట్ లేదని పోలీసులు ఆపారు. వారి చేతిలో భోజనం సంచి ఉన్నా, ఆస్పత్రికి పోతున్నామని చెప్పినా వదిలి పెట్టలేదు. ఫైన్ కడతాం వదిలేయండి అని బతిమిలాడినా మధ్యాహ్నం ఒకటిన్నర వరకు వారిని ఇబ్బందులకు గురిచేశారని వారు తెలిపారు.

28న జాతీయ మెగా లోక్ అదాలత్

- సీనియర్ సివిల్ జడ్జి శ్యాంకుమార్, జూనియర్ సివిల్ జడ్జి మారుతీ ప్రసాద్



న్యాయవాదుల సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి జట్టా శ్యాంకుమార్

హుజూర్‌నగర్ : ఈనెల 28న జరగనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను న్యాయవాదులు, పోలీస్, ఎక్సైజ్ అధికారులు సమష్టిగా విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి శ్యాంకుమార్, జూనియర్ సివిల్ జడ్జి మారుతీ ప్రసాద్‌లు కోరారు. శుక్రవారం పట్టణంలోని న్యాయ స్థానంలో న్యాయవాదులు, పోలీస్ అధికారులతో వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమై హుజూర్‌నగర్ జిల్లాలో ప్రథమ స్థానంలో నిలవగా, రాష్ట్ర స్థాయిలో నాలుగవ స్థానంలో నిలిచిందని వారు తెలిపారు. ఈ సారి రాష్ట్ర స్థాయిలో మరింత ఉన్నతమైన స్థానం లభించే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, జక్కుల నాగేశ్వరరావు, నాగేష్ రాథోడ్, కుక్కడపు సైదులు, కోదాడ డీఎస్పీ శ్రీధర్ రెడ్డి, సీఐలు చరమందరాజు, రజితారెడ్డి, ఎస్‌ఐలు, ఎక్సైజ్ ఎస్‌ఐ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి



నడిగూడెంలో శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రామకృష్ణారెడ్డి

నడిగూడెం : ప్రశాంత వాతావరణంలో గణేశ్‌ని నిమజ్జనాలు జరుపుకోవాలని మునగాల సీఐ డి.రామకృష్ణారెడ్డి కోరారు. శుక్రవారం నడిగూడెం పోలీస్ స్టేషన్ ఆవరణలో గణేశ్ నవరాత్రి ఉత్సవ కమిటీల సభ్యులతో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిమజ్జన కార్యక్రమాల్లో ఎలాంటి ప్రాణ, ఆస్థి నష్టం జరగకుండా జాగ్రత్త పడాలన్నారు. సాయంత్రం ఐదు గంటలలోపు నిమజ్జనాలు పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వి.సరిత, ఎంపీడీఓ ఎస్‌డీ.ఇమామ్, విద్యుత్ శాఖ ఏఈ సైదా, ఏఎస్‌ఐలు జగన్నాథం, మల్సూర్, తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి చేయాలి

కోదాడరూరల్ : కోదాడ పెద్ద చెరువులో ఈ నెల 16న వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని తహసీల్దార్ వాజిద్ అలీ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, పోలీస్, మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిమజ్జనానికి గణనాథులు ఎక్కువ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, డీజేలు పెట్టకుండా పోలీసులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. చెరువు వద్దకు వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా మంచి నీరు, శానిటైజేషన్, లైటింగ్, బారికేడ్లు, జనరేటర్ సౌకర్యం కల్పించాలన్నారు. నిమజ్జనం రోజు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్, విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, పలు శాఖల అధికారులు ఉన్నారు.

నిమజ్జనాలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి

చిలుకూరు : మండలంలో వినాయక నిమజ్జనాలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని తహసీల్దార్ ధృవ కుమార్ అన్నారు. గణేశ్ నిమజ్జనం ఏర్పాట్లపై శుక్రవారం చిలుకూరు తహసీల్దార్ కార్యాలయంలో పోలీస్, రెవెన్యూ, మండల పరిషత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేశ్ నిమజ్జన స్థలాలను గుర్తించి అక్కడ అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గిరిబాబు, ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు, ఆర్‌ఐలు సీతయ్య, శ్వేత, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

గండి పూడ్చి, నీటిని విడుదల చేయాలి



ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌కు గండి పడిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండల పరిధిలోని ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ 14వ కిలోమీటర్ వద్ద పడిన గండిని వెంటనే పూడ్చి నీటిని విడుదల చేయాలని మాజీ జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం గండి పడిన ప్రదేశాన్ని ఆ పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇటీవల వర్షాలకు బూరుగడ్డ నల్లచెరువు, గోపాలపురం మోదుగుల చెరువులు తెగి పంట పొలాలు కొట్టుకుపోయాయని దీంతో ఆయా ప్రాంతాల్లో రైతులు తిరిగి వరినాట్లు వేసుకున్నారని తెలిపారు. కానీ కాలువ కట్టలు తెగి నీరు లేక ఆయకట్టులో వరి పొలాలు ఎండిపోయే పరిస్థితి ఉందని, తెగిన చెరువులు, కుంటలు, కాలువలకు మరమ్మతులు చేపట్టేలా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కీత జయమ్మధనమూర్తి, ఆ పార్టీ నాయకులు షేక్ అలీపాషా, సయ్యద్ అబ్దుల్ నబి, మాడుగుల పరుశురాం, గువ్వల వీరయ్య, కీత కృష్ణమోహన్, సారెడ్డి భాస్కర్‌రెడ్డి, సుందరయ్య, వీరబాబు, సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

ఆయకట్టులో ఎండిపోతున్న పొలాలు

చిలుకూరు : ప్రస్తుతం ఎండలు మండిపోతుండడంతో ఆయకట్టులో వరి పొలాలు ఎండిపోతున్నాయని తక్షణమే ఇటీవల వరదలకు కాలువలకు పడిన గండ్లను పూడ్చి సాగర్ నీటిని విడుదల చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు చిలుకూరులో విలేకరులతో మాట్లాడారు. మండలంలోని ఆర్‌కే మేజర్, ముక్త్యాల కాలువల మరమ్మతులు చేపట్టి నీళ్లు విడుదల చేయాలన్నారు. వర్ష బీభత్సానికి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అంబాల రాంబాబు, మాజీ ఎంపీపీ దొడ్డా సురేష్‌బాబు, పీఏసీఎస్ డైరెక్టర్లు కస్తూరి సైదులు, కొదారు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో పోషణ్ అభియాన్

మఠంపల్లి : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం– 2లో శుక్రవారం పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, కిషోర బాలలకు పౌష్టికాహారం అందజేయడంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్ గోవిందమ్మ, నలబోతుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న అంగన్‌వాడీలు, గ్రామస్తులు

సీతారాం ఏచూరికి ఘన నివాళి



పాలకవీడులో సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



కోదాడరూరల్ : ఏచూరి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

కోదాడరూరల్ : సీతారాం ఏచూరి మృతి పీడిత ప్రజలకు తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎం.ముత్యాలు, జుట్టుకొండ బసవయ్య, డాక్టర్ సూర్యనారాయణ, రాపోలు సూర్యనారాయణ, కుక్కడపు నళిని, దాసరి శ్రీనివాస్, నవీన్ తదితరులు ఉన్నారు.

ఏచూరి మృతి దేశానికే తీరని లోటు

మోతె : సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం భారత దేశానికే తీరని లోటని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శివర్గ సభ్యుడు మట్టిపెల్లి సైదులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం.గోపాల్‌రెడ్డి, పోతయ్య, మల్లయ్య, శ్రీను, యాదమ్మ, సోమయ్య పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని టీఎస్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి అన్నారు. శుక్రవారం పట్టణంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. మార్క్సిస్టు పార్టీ ఒక సైనికుడిని కోల్పోయిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సుతారి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో సంతాప వ్యక్తం తెలిపారు.

పాలకవీడు : సీతారాం ఏచూరి మృతి భారత కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని ఆ పార్టీ మండల కార్యదర్శి అనంతప్రకాష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముషం నరసింహ, పగడాల మట్టేష్, దిద్దకుంట్ల పురుషోత్తంరెడ్డి, ఆర్లపూడి వీరభద్రం, యరడ్ల మల్లారెడ్డి, సన్నెపంగ రమేష్, వెంకట్‌రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండల కేంద్రంలో శుక్రవారం సీతారాం ఏచూరి చిత్రపటానికి రిటైర్డ్ ఉపాధ్యాయుడు పోటు రామారావు, మాజీ సర్పంచ్ మాశెట్టి అంజయ్యలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అబ్బిరెడ్డిగూడెంలో ఏచూరి చిత్రపటానికి సీపీఎం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి యాకూబ్, మండల నాయకులు బోయిల అర్జున్, యానాల సోమయ్య, సుశీల, రాంబాబు, కాశయ్య, కిరణ్, గోపి పాల్గొన్నారు.

నడిగూడెం : మండల కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో శుక్రవారం సీతారాం చిత్రపటానికి సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి, వివిధ పార్టీల నాయకులు కొరట్ల శ్రీనివాస్, దేవబత్తిని రమేష్ ప్రసాద్, గడ్డం మల్లేష్, బెల్లంకొండ హనుమయ్య, సుధాకర్‌రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

నేరేడుచర్ల : పట్టణంలోని అరిబండి భవనంలో శుక్రవారం సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి వామ పక్షాలు, టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ, టీడీపీ నాయకులు సిరికొండ శ్రీను, కొదమగుండ్ల నగేష్, ధనుంజయనాయుడు, ఇంజమూరి వెంకటయ్య, తిరుపతయ్య, సీలా రామ్మూర్తి, మధు, నాగ సైదులు, మీనయ్య, శ్రీను, సైదులు, భరత్, వెంకన్న, ఏసు, అమరారెడ్డి, కోటయ్య ఉన్నారు.

బూరుగడ్డ ఆలయంలో గోపూజ



గోమాత పూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం సహస్రనామ కుంకుమార్చనను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, మంగళాశాసనం, సహస్రనామ కుంకుమార్చనలు, స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం, శ్రీగోదాదేవికి ప్రత్యేక పూజలు, అష్టోత్తర శతనామావళి, అలంకరణ, గోపూజ, అనంతరం ఆరగింపు, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ ఎంపీ లక్ష్మణరావు, అర్చకులు ముడుంబై హరీష్‌కుమార్‌చార్యులు, ఆలయ సిబ్బంది యరగాని కిరణ్‌గౌడ్, గోవిందరెడ్డి, రమేష్, ఉపేందర్, భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడి మృతికి సంతాపం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు జక్కుల వెంకటేశ్వర్లు మృతదేహానికి శుక్రవారం పట్టణ కాంగ్రెస్ నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. నివాళులర్పించిన వారిలో నాయకులు జె.మల్లయ్య, జి.రామయ్య, పి.రామరాజు, కె.ఉపేందర్, జె.శంబయ్య, బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విఘ్నేశ్వరుడికి పూజలు



కోదాడ : నయానగర్‌లో వినాయకుడి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



చిలుకూరు : నారాయణపురంలో గణపతికి పూజలు చేస్తున్న భక్తులు

హుజూర్‌నగర్ : పట్టణంలో పలు వాడల్లో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. వినాయకుడికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మల్లన్న నగర్‌లో తండు హరికృష్ణగౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి, సీఐ చరమందరాజు, ఎస్‌ఐ ముత్తయ్యలు ప్రారంభించారు. పలువురు కౌన్సిలర్లు, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

వినాయకుడి మండపాల వద్ద అన్నదానాలు

నేరేడుచర్ల : గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మున్సిపాలిటీలో పలుచోట్ల ప్రతిష్ఠించిన విఘ్నేశ్వరుడికి భక్తులు పూజలు చేస్తున్నారు. శుక్రవారం నూతన తహసీల్దార్ కార్యాలయం సమీపంలో, రాఘవేంద్ర కాలనీ, మున్సిపల్ కార్యాలయం వీధిలో ఏర్పాటు చేసిన గణనాథుడి మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అలక సరిత ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి, ఎస్‌ఐ రవీందర్‌నాయక్, వైద్యాధికారిని నాగిని, కార్యదర్శి సన్నీ, ఆలయ కమిటీ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, నాగండ్ల శ్రీధర్, తాళ్ల సురేష్‌రెడ్డి, గణేష్‌రెడ్డి, ఆదిరెడ్డి, రామచంద్రారావు, రాంమోహన్, వెంకటరమణారావు, ప్రసాద్, గోళ్ల సుధాకర్, నాగమాధవ్ ఉన్నారు.

వినాయక విగ్రహాల వద్ద పూజలు

చిలుకూరు : మండల వ్యాప్తంగా శుక్రవారం వినాయక విగ్రహాల వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల అన్నదానం చేశారు.

మైహోం ఎస్టేట్‌లో అన్నదానం

కోదాడరూరల్ : గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కోదాడ పట్టణంలోని గుడిబండలో రోడ్డులో గల మైహోం ఎస్టేట్‌లో ఏర్పాటు చేసిన గణేశ్ మండపం వద్ద శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదానాన్ని మైం హోం యాజమాన్యం జూపల్లి భార్గవి, కౌశిక్‌రావులు ప్రారంభించారు. గణపతి లడ్డూను పొనుగోటి దయాకర్‌రావు రూ.46,116లకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ప్లాంట్ హెడ్ శ్రీనివాసరావు, జీఎం రాజశేఖర్, నరేందర్, సీహెచ్.లక్ష్మీనారాయణరెడ్డి, వంగవీటి రామారావు, చెరకు అశోక్, ముత్యాలు, శ్రీనివాసరావు, విష్ణు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ : అన్నదానం ప్రారంభిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్, సీఐ, ఎస్‌ఐలు

రామాలయం యూత్ ఆధ్వర్యంలో..

పాలకవీడు : మండల వ్యాప్తంగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం మండల కేంద్రంలో వినాయక మండపం వద్ద రామాలయం యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగలక్ష్మి, యూత్ సభ్యులు జితేందర్‌రెడ్డి, బట్టు కమలాకర్‌రెడ్డి, మేకల మట్టపల్లి, శంకర్, యలంచెర్వు బాల్‌రెడ్డి, నవీన్, రాజశేఖర్‌రెడ్డి, వీరబాబు గ్రామపెద్దలు పాల్గొన్నారు.



నేరేడుచర్లలో అన్నదానం ప్రారంభిస్తున్న మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అలక సరిత



పాలకవీడులో అన్నదానం చేస్తున్న యూత్ సభ్యులు



కోదాడరూరల్ : అన్నదానం చేస్తున్న మైహోం యాజమాన్యం, ఉద్యోగులు

బీఆర్‌ఎస్ నేతల అరెస్టు అప్రజాస్వామికం



కోదాడ : తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కోదాడ : బీఆర్‌ఎస్ నేతల అరెస్టు అప్రజాస్వామికమని పార్టీ కోదాడ పట్టణ అధ్యక్షుడు ఎస్‌కె.నయీం అన్నారు. రాష్ట్ర రాజధానిలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ఇంటిపై దాడి చేయడం, బీఆర్‌ఎస్ నాయకులపై అక్రమంగా కేసులు పెట్టడాన్ని ఖండిస్తూ శుక్రవారం కోదాడలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీఆర్‌ఎస్ పట్టణ నాయకులు ధర్నా నిర్వహించారు. గట్ల కోటేశ్వరరావు, కర్ల సుందర్‌రావు, పిట్టల భాగ్యమ్మ, చలిగంటి వెంకట్, అబ్బు, అబిదర్‌నాయుడు, దొంగరి శ్రీను, ఇమ్రాన్, నిస్సార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు

నడిగూడెం : బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేయడాన్ని నిరసిస్తూ నడిగూడెంలో శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు ధర్నా చేస్తారని ముందస్తుగా పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు పల్లా నర్సిరెడ్డి, నాయకులు అనంతుల అంజనేయులు, దాసరి శ్రీను, భోనగిరి ఉపేందర్, కన్నెబోయిన శ్రీను, చంద్రయ్య, వీరబాబు, వీరస్వామి, వెంకటేశ్వర్లు ఉన్నారు.

పాలకవీడు : బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడిని ఖండిస్తూ హరీష్‌రావు సైబరాబాద్ కమిషనరేట్ ఎదుట ధర్నాకు పిలుపునివ్వడంతో శుక్రవారం పాలకవీడులో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలను ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో బీఆర్‌ఎస్ పార్టీ యువజన నాయకుడు పెరుమాళ్ల సతీష్, మంద నాగయ్య, జాన్‌రెడ్డి, అచ్చయ్య, వెంకన్న, హనుమంతు, సిద్దు పాల్గొన్నారు.

చిలుకూరు : బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావుతో పాటు పలువురు ఎమ్మెల్యేల అక్రమ అరెస్టుకు నిరసనగా చేపట్టిన ధర్నాకు బీఆర్‌ఎస్ నాయకులు వెళ్లకుండా పోలీసులు స్థానిక బీఆర్‌ఎస్ నాయకులను శుక్రవారం ముందస్తుగా అరెస్టు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్కినపల్లి జానకీరామాచారి పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ : బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు ఇచ్చిన పిలుపు మేరకు స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు కేశంపేటకు వెళ్లకుండా హుజూర్‌నగర్ ఎస్‌ఐ ముత్తయ్య శుక్రవారం తెల్లవారుజామున బీఆర్‌ఎస్ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో బీఆర్‌ఎస్ నాయకులు బెల్లకొండ అమర్, ముల్కలపల్లి రాంబాబు, దగడ గోపి, మల్లేష్, రామకృష్ణ, రవీందర్, మల్లయ్య ఉన్నారు. అదే విధంగా చింతలపాలెంలో మండల బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై వదిలిపెట్టారు.

ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే తెలపాలి



నేరేడుచర్లలో ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేస్తున్న ఎంపీడీఓ

నేరేడుచర్ల : గ్రామ పంచాయతీల ముసాయిదా ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే ఈనెల 21వ తేదీలోగా రాత పూర్వకంగా తెలపాలని ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేసి మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లోని నోటీసు బోర్డులో వార్డుల వారిగా ఓటరు జాబితా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శులు ఉన్నారు.

వార్డుల వారీగా ఓటరు జాబితా

చిలుకూరు : మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ గిరిబాబు కార్యదర్శులతో కలిసి మండల ఓటరు జాబితాను ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో వార్డుల వారీగా ఓటరు జాబితా ప్రదర్శిస్తామని, అభ్యంతరాలు ఉంటే గ్రామ కార్యదర్శికి తెలపాలని ఓటర్లకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ జగదీష్, కార్యదర్శులు పాల్గొన్నారు.